క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-1లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఈఈ బి.సింహాచలం నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు సెక్టార్-1, సెక్టార్-2, కొత్త వెంకోజీపాలెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఖైదీలకు మజ్జిగ పంపిణీ ప్రారంభం

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీలకు గురువారం మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ప్రతి ఏడాది వేసవిలో రెండు నెలల పాటు ఖైదీలకు చలవ కోసం మజ్జిగ ప్రత్యేకంగా అందజేస్తారు. ఇందులో భాగంగా ఖైదీలకు మధ్యాహ్న భోజనం సమయంలో 250 ఎంఎల్(పావు లీటర్) మజ్జిగ అదనంగా అందిస్తున్నారు. ప్రస్తుతం శిక్ష పడిన ఖైదీలు, రిమాండ్ ఖైదీలు కలిపి సుమారు 2,000 మంది వరకు ఇక్కడ ఉన్నట్లు జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్ బాబు తెలిపారు. వారందరికీ మే నెలాఖరు వరకు మజ్జిగ పంపిణీ కొనసాగుతుందన్నారు.

ఆరిలోవ ప్రాంతంలో కార్డన్ సెర్చ్



బాలాజీనగర్‌లో ద్విచక్ర వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో గురువారం వేకువజామున పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా ఆరిలోవ సీఐ సీహెచ్.మల్లేశ్వరరావు, ఎస్ఐలు రాందాస్, శంకర్ ముడు బృందాలుగా సిబ్బందితో కలసి బాలాజీనగర్, డ్రైవర్స్ కాలనీ, ముస్తఫా కాలనీ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. వీధుల్లో ఇళ్ల ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను పరిశీలించారు. ఆయా వాహనాల యజమాన్లను పిలిచి వాటికి సంబంధించిన పత్రాలు చూపమన్నారు. వాటిని పరిశీలించి, ఎలాంటి పత్రాలు చూపని నాలుగు ద్విచక్ర వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహన యజమానుల వద్ద తప్పనిసరిగా పత్రాలు ఉండాలని సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తుల వాహనాలను ఇళ్ల ముందు నిలపకుండా చూడాలని స్థానికులకు సూచించారు. వీధుల్లో ఎవరైనా గుర్తు తెలియని వాహనాలను ఎక్కువ రోజులు నిలిపి ఉంచితే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు.

మానసిక ఆస్పత్రికి మతిస్థిమితం లేని మహిళ



మహిళతో మాట్లాడుతున్న మహారాణిపేట పోలీసులు, మమత

అల్లిపురం: కొంత కాలంగా బీచ్‌రోడ్డులోని గోకుల్ పార్క్, సీ పరెల్ ఏరియాల్లో మతిస్థిమితంలేని మహిళ తిరుగుతున్నట్లు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి గమనించారు. విషయాన్ని మహారాణిపేట పోలీసులకు తెలిపారు. దీంతో వారు మమతా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మమత సహకారంతో ఆ మహిళను గుర్తించి చినవాల్తేరులో గల మానసిక వైద్యశాలలో చేర్పించారు. ఆమెకు చికిత్స అందజేస్తున్నట్లు మహారాణిపేట పోలీసులు తెలిపారు.

ప్రేమోన్మాదిని శిక్షించాలి

మహారాణిపేట: మధురవాడ స్వయంకృషి నగర్‌లో ప్రేమ పేరుతో ఉన్మాదిగా మారి, పెళ్లికి నిరాకరించిన యువతి దీపికపై దాడికి పాల్పడి, అడ్డు వచ్చిన ఆమె తల్లిని దారుణంగా హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా, మహిళా సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కేజీహెచ్ మార్చురీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకురాలు పి.మణి మాట్లాడుతూ తక్షణం హోం మంత్రి అనిత బాధిత కుటుంబాన్ని పరామర్శించి, నష్టపరిహారం ప్రకటించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి, మద్యం విచ్చలవిడిగా దొరకడం వల్ల దారుణాలు పెరిగాయని ఆరోపించారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎండీ బేగం, దేవుడమ్మ, పుష్ప, ఐద్వా నాయకులు కొండమ్మ, సుజాత, పద్మ, సీపీఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సీఐటీయూ నాయకులు ఆర్.కె.ఎస్.వి.కుమార్ పాల్గొన్నారు.

తీరంలో భద్రత డొల్ల..!



ఏయూక్యాంపస్: నగరంలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతం అది. నిత్యం వేలాది మంది సందర్శించే అందమైన.. విశాలమైన ప్రదేశం. అటువంటి జన సాంద్రత కలిగిన ప్రాంతలో భద్రత డొల్ల అని తెలుస్తోంది. దీనికి అద్దం పట్టే విధంగా ఈ చిత్రాలు ఉన్నాయి. బీచ్ రోడ్డులోని ఆర్కే బీచ్ సమీపంలో మద్యం సీసాలు పదుల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. ఆర్కే బీచ్ వద్ద తీరంలో నిర్మించిన చిన్నపాటి షెడ్ మందుబాబులు, మత్తు పదార్థాలు సేవించే వారికి అడ్డాగా మారిపోయింది. ఎండ సమయంలో ఇక్కడ విధులు నిర్వహించే బీచ్ స్విమ్మర్లు ఉండటం కోసం ఈ షెడ్ ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో ఈ ప్రాంతంలో నిఘా ఉండకపోవడంతో మందుబాబులు యథేచ్ఛగా ఈ ప్రాంతాన్ని తమకు అనుకూలంగా మార్చేసుకుని మందు పార్టీలు చేసుకుంటున్నారు. దర్జాగా మద్యం తాగుతూ అక్కడే సీసాలు పారేస్తున్నారు. నిత్యం వేలాది మంది పర్యాటకులు వచ్చే అత్యంత ప్రాముఖ్యమైన ఆర్కే బీచ్ ప్రాంతంలో మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరముందని పలువురు సందర్శకులు కోరుతున్నారు.



ఆర్కే బీచ్‌లో స్విమ్మర్ల షెడ్ వెనుక తాగిపడేసిన మద్యం సీసాలు (ఇన్‌సెట్‌లో) మద్యం సీసాలు

తీరానికి కోత

దెబ్బతింటున్న బీచ్ రోడ్డు, ఫుట్‌పాత్‌లు



బీచ్ రోడ్డులో ఏర్పడిన భారీ గొయ్యి

సుందరమైన విశాఖ సాగర తీరానికి తీరని కోత ఏర్పడుతోంది. ప్రకృతి పరంగా జరిగే మార్పుల ఫలితంగా తరచూ తీర ప్రాంతం అనేక ఆటుపోట్లకు గురవుతోంది. దీనిలో భాగంగా సముద్ర తీరంలో పలు చోట్ల కోత ఏర్పడింది. ప్రస్తుతం డ్రెడ్జింగ్ జరుగుతున్న ప్రాంతంలోనే భారీగా కోతకు గురవుతోంది. దీని ఫలితంగా ఫుట్‌పాత్, బీచ్ రోడ్డుకు సైతం భారీ గుంత ఏర్పడుతోంది. ఫుట్‌పాత్‌పై వేసిన గ్రానైట్ పలకలు సైతం విరిగిపోయి ప్రమాదకరంగా మారుతున్నాయి. తీర ప్రాంతంలో ఇసుక కోతకు గురవడంతోపాటు నేల అడుగు భాగం నుంచి కూడా కోత ఏర్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. దీనికి సంపూర్ణ పరిష్కారం చూపాల్సిన అవసరం నిపుణులపై ఉంది.



తీరం వద్ద ఫుట్‌పాత్ శిథిలమై పైకి లేచిన గ్రానైట్ పలకలు

పక్కాగా ఒంటి పూట బడుల అమలు

విశాఖ విద్య: వేసవి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్న దృష్ట్యా అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఒంటి పూట బడులు పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం గురువారం ఒక ప్రకటనలో సూచించారు. తొమ్మిది, పదో తరగతులకు ప్రత్యేక తరగతులు పేరిట రెండు పూటలా నిర్వహిస్తున్నట్లు తమ కమిషన్‌కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఫిర్యాదులు అందజేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎవరికీ ఎటువంటి మినహాయింపులు ఉండబోవని, ఒంటి పూట బడులు అమలు జరపాల్సిందేనన్నారు. తమ కమిషన్ ఆదేశాలు, ప్రభుత్వ ఉత్తర్వులు పాటించని పాఠశాలల యాజమాన్యాలపై డేగకళ్లతో పర్యవేక్షణ జరపడం తోపాటు ఆయా స్కూళ్ల గుర్తింపు రద్దు, క్రిమినల్ చర్యలకు వివిధ సిఫార్సులు చేస్తామని చెప్పారు.

అందరి భాగస్వామ్యంతోనే దేశ ఆర్థికాభివృద్ధి



సావనీర్ ఆవిష్కరిస్తున్న పెట్రోలియం కార్పొరేషన్ డైరెక్టర్ సురేష్ శెట్టి, ఏయూ వీసీ తదితరులు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

విశాఖ విద్య: దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రతి వ్యక్తి భాగం కావాల్సిన అవసరముందని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హ్యూమన్ రిసోర్సెస్) డైరెక్టర్ కె.సురేష్ శెట్టి అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అసెంబ్లీ హాల్‌లో ఫైనాన్షియల్ ఇంక్లూజన్ అండ్ సోషల్ ఈక్వాలిటీ పేరిట గురువారం నిర్వహించిన సదస్సును ఆయన ప్రారంభించి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సేవలు అందరికీ అందుబాటులో ఉంచడం, అందరూ వీటిని పొందేలా చూడటం, బాధ్యతయుతమైన సేవలందించడం, సకాలంలో సేవలు అందించడం అనే ఈ నాలుగు ప్రధానమైన అంశాలను పరిగణలోకి తీసుకొని ఆర్థిక సేవలు ప్రజలందరికీ చేరువ కావాల్సిన అవసరాన్ని వివరించారు. మహిళలు, యువతను దీనిలో భాగస్వాములను చేయడం అవసరమన్నారు. భారతదేశం నేడు ఉపాధి అవకాశాలను సృష్టించే వేదికగా నిలుస్తున్న విధానాన్ని తెలియజేశారు. హెచ్‌పీసీఎల్ సంస్థ ప్రత్యేకతలు, విశిష్టతలను వివరించారు. ప్రత్యేక అతిథి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిజినెస్ అండ్ ఆపరేషన్స్ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్ మాట్లాడుతూ ఫైనాన్షియల్ పవర్ హౌస్‌గా భారత్ నిలవాలని సూచించారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ ఇటువంటి విషయాలపై సామాన్యులకు సైతం పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సదస్సు సావనీర్‌ను అతిథులతో కలిసి వీసీ ఆవిష్కరించారు. సదస్సు కన్వీనర్ ఆచార్య జాలాది రవి, అధిక సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌బీ కాలనీ రోడ్డులో దుకాణాల తొలగింపు



దుకాణాలు తొలగిస్తున్న యజమానులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాలకు వెళ్లే రోడ్డులో సులభ్ కాంప్లెక్స్‌కు ఎదురుగా స్టీల్‌ప్లాంట్ స్థలాలకు ఆనుకుని ఉన్న దుకాణాలను గురువారం తొలగించారు. ఇక్కడి బడ్డీలను వెంటనే తొలగించాలని స్టీల్‌ప్లాంట్ ఎస్టేట్ ఆఫీసర్ జనార్దన్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టారు. మిగిలిన వారు కూడా తక్షణం తమ దుకాణాలను తొలగించాలని, లేకుంటే బందోబస్తుతో వాటిని తీసివేస్తామని ఈవో హెచ్చరించారు. తమకు విద్యుత్ శాఖ వారు విద్యుత్ మీటర్లను కూడా మంజూరు చేశారని, ముందుగా విద్యుత్ శాఖ వారు మీటర్లను తీస్తే, తాము బడ్డీలను తొలగిస్తామని దుకాణదారులు చెబుతున్నట్లు ఎస్టేట్ ఆఫీసర్ పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్టేట్ అధికారి చుట్టు పక్కల 15, 16 వార్డుల సచివాలయం టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. వెంటనే విద్యుత్ శాఖ వారికి నోటీసులు జారీ చేసి, మీటర్లను తొలగించే చర్యలు చేపట్టాలని కోరారు. స్థల యజమానులు తమకు అడ్డుగా ఉన్న బడ్డీలను తొలగించాలని తమపై ఒత్తిడి తీసుకొస్తున్నారని, టౌన్ ప్లానింగ్ అధికారులు, విద్యుత్ శాఖాధికారులు తమతో సహకరించాలని స్టీల్‌ప్లాంట్ ఎస్టేట్ ఆఫీసర్ విజ్ఞప్తి చేశారు.

డ్రగ్స్ రహిత నగరంగా తీర్చిదిద్దుదాం



డ్రగ్స్ దుష్పరిణామాల గురించి వివరిస్తున్న పోలీస్ కమిషనర్ బాగ్చి

గోపాలపట్నం: సుందర విశాఖను మాదక ద్రవ్యాల రహిత నగరంగా మారుద్దామని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. అందుకు విద్యార్థుల సహకారం అవసరమన్నారు. మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై గోపాలపట్నం ఆదిత్య కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాలు బయట వ్యక్తుల వల్ల అలవాటవుతాయని, అలాంటివారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరస్తుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న మోసాల గురించి అవగాహనతో ఉండాలన్నారు. బెట్టింగ్ యాప్‌ల వల్ల ఇబ్బందుల్లో పడతారని హెచ్చరించారు. కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడవద్దని హితవు పలికారు. ఈగల్ సీఐ కల్యాణి మాట్లాడుతూ ఈగల్ పోలీస్ వ్యవస్థ మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఏర్పాటైందని తెలిపారు. అసాంఘిక శక్తులను అరికట్టేలా పనిచేస్తుందన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటివి అమ్ముతున్నా, ఎవరి వద్దనైనా కలిగి ఉన్నా 1972 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారమివ్వాలని సూచించారు. అనంతరం సీపీని కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహనరావు ఘనంగా సత్కరించారు.

శ్రావ్యంగా భక్తి గీతాలాపన



భక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ సెక్టార్-6లోని శ్రీ వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులచే సంగీత విభావరి నిర్వహించారు. విద్యార్థులు ఆలపించిన భక్తి సంగీత సంకీర్తనలు అలరించాయి. అన్నమయ్య, రామదాసు భక్తి గీతాలు శ్రావ్యంగా పాడి ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులను ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. స్థానిక భక్తులు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో సహస్ర దీపాలంకరణ సేవ



దీపాలంకరణ సేవలో పాల్గొన్న భక్తులు

ఏయూక్యాంపస్: ఏయూ అవుట్‌గేట్ వద్దనున్న శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో వసంత నవరాత్రుల్లో భాగంగా గురువారం సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వయంగా దీపాలు వెలిగించారు. శుక్రవారం పంచామృతాభిషేకం, మంగళాస్నానాలు చేయిస్తారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వన్నె రాంబాబు, కోశాధికారి రాజు, రాంబాబు, వెంకటేశ్వరరావు, బి.తిరుమలరావు, తాతారావు, అప్పారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టి సారించండి

అల్లిపురం: స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలని జోన్-4 కమిషనర్ మల్లయ్యనాయుడు సూచించారు. వెంకటేశ్వరమెట్ట సచివాలయంలో గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేటర్ విశాఖ మంచి ర్యాంకు సాధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సచివాలయ సిబ్బంది, ఆర్పీలను కోరారు. ప్రజలను కలిసి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నారు.

మలేరియా, డెంగ్యూ రికార్డుల అందజేత



ల్యాబ్ టెక్నీషియన్లకు రికార్డులు అందజేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

సీతంపేట: జిల్లాలో ఉన్న అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో గల ల్యాబ్‌లలో డెంగ్యూ, మలేరియా రిజిస్టర్లు, చార్టులు పూర్తి స్థాయిలో నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు అన్నారు. ఇటీవల కొత్తగా రూపొందించిన మలేరియా, డెంగ్యూ రిజిస్టర్లు, చార్టులను స్థానిక సీతంపేటలో గల వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 73 ప్రాథమిక, పట్టణ, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న అన్ని రకాల మలేరియా డెంగ్యూ రిజిస్టర్లు, చార్టులు సక్రమంగా నిర్వహించి సకాలంలో డైలీ, వీక్లీ, మంత్లీ, యాన్యువల్ రిపోర్టులు అందజేయాలని ల్యాబ్ టెక్నీషియన్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో చిత్రాడ సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, పలువురు ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

విమ్స్ రహదారికి మోక్షమెప్పుడో..?



బీఆర్‌టీఎస్ రహదారి వైపు విమ్స్ ద్వారం వద్ద శిథిలమైన రోడ్డు



విమ్స్ రహదారిలో గోతులు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) రహదారి శిథిలావస్థకు చేరింది. సుమారు ఏడాది నుంచి ఇక్కడ శిథిలమైన రోడ్డుపైనే రాకపోకలు జరుగుతున్నాయి. ఈ రహదారికి ఎప్పుడు మోక్షం కలుగుతుందా అంటూ విమ్స్‌కు వెళ్తున్న రోగులు, వారి బంధువులు, ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. విమ్స్‌కు బీఆర్‌టీఎస్ రోడ్డు వైపు ఉన్న ప్రవేశ ద్వారం నుంచి లోపలకు వెళ్లే రోడ్డు గోతులు పడింది. ఇక్కడ ద్వారం వద్ద ఫుట్‌పాత్ పలకలు ఊడిపోయి పూర్తిగా దెబ్బతింది. రోడ్డుపై పలుచోట్ల గోతులు పడ్డాయి. ప్రవేశ ద్వారం నుంచి ఆస్పత్రిలోకి రోగులను తీసుకెళ్లే విమ్స్ బ్యాటరీ రిక్షాలకు సైతం ఈ రోడ్డుపై ఇబ్బంది కలుగుతోంది.

ఇదిలా ఉండగా.. ఇక్కడ నాలుగు నెలల కిందట ప్రారంభించిన ఆరిలోవ కొత్త పోలీస్ స్టేషన్‌కు వెళ్లే దారి కూడా ఇదే కావడం విశేషం. స్టేషన్‌కు ప్రస్తుతం ప్రత్యేకంగా రోడ్డు లేదు. దీంతో బీఆర్‌టీఎస్ రహదారిని ఆనుకొని విమ్స్ ప్రవేశ ద్వారం నుంచే లోపలకు వెళ్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకోవాలి. పోలీసుల వాహనాలతోపాటు సిబ్బంది, ఫిర్యాదుదారులు ఇదే దారిని వినియోగిస్తున్నారు. దీంతో నిత్యం ఇక్కడ రద్దీగా ఉంటుంది. సుమారు ఏడాది నుంచి ఈ రోడ్డు శిథిల స్థితిలో ఉన్నప్పటికీ విమ్స్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం విశేషం. తక్షణం ఈ రహదారిని బాగుచేయాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

సీతమ్మధార: వీఎంఆర్‌డీఏ పరిధిలోని వివిధ పార్కుల్లో గత 30 ఏళ్లుగా పని చేస్తున్న 11 మంది గార్డెన్ కార్మికులను వుడా అధికారులు అన్యాయంగా తొలగించారని ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద తొలగించిన కార్మికులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని లేదా పని చేసిన కాలానికి గ్రాట్యుటీ, బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. వుడాలో సొసైటీ కార్మికులుగా ఉన్న 11 మందిని 60 ఏళ్లు నిండాయన్న నెపంతో తొలగించడం దుర్మార్గమని, రాష్ట్ర ప్రభుత్వం 62 ఏళ్ల వయో పరిమితి పెంచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గార్డెన్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, వారాంతపు, ప్రభుత్వ, పండగ సెలవులు, గ్రాట్యుటీ వంటి ఏ కార్మిక చట్టాలు అమలు చేయడానికి అధికారులు, వుడా చెర్మన్, కార్మిక శాఖ అధికారులు ఎందుకు పూనుకోవడం లేదని ప్రశ్నించారు. వీరిని తొలగించి 6 నెలలు కావస్తున్నా వుడా కమిషనర్, చెర్మన్, డీసీఎల్ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇప్పటికైనా తొలగించిన కార్మికులకు న్యాయం చేయాలని, లేదంటే కుటుంబాలతో వీఎంఆర్‌డీఏ కార్యాలయం ఎదుట దీక్ష చేపడతామన్నారు. ధర్నాలో కార్మికులు రాంబాబు, శ్రీను, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉపాధి అవకాశాలు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు

మురళీనగర్: పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అన్నారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలిసెట్-2025 ప్రవేశ పరీక్షకు సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ అయ్యిందని, ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 15 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జి.గణేష్ ఆదేశాల మేరకు పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహిస్తున్నామన్నారు. ముందుగా ఇచ్చిన సమాచారం మేరకు టెన్త్ పూర్తి చేసిన వారు, పదో తరగతి పరీక్షలు రాసిన 200 మంది విద్యార్థులు శిక్షణ తరగతులకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. బాలబాలికలకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తామన్నారు. స్టడీ మెటీరియల్‌ను ప్రిన్సిపాల్ ఆవిష్కరించి విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

నాసా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో పాఠశాల ఏజీఎం రాజ్‌కుమార్

సీతమ్మధార: ఇటీవల నాసాలో నిర్వహించిన పోటీల్లో నారాయణ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా గురువారం మధ్యాహ్నం నాసా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆశీల్‌మెట్టలోని పాఠశాల ఆవరణలో ఏజీఎం జి. రాజ్‌కుమార్ అభినందించారు. నాసా నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాలల విద్యార్థులు రూపొందించిన పది ప్రాజెక్టులు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కూర్మన్నపాలెం ఒలింపియాడ్ విద్యార్థులు రూపొందించిన ఆర్బిటల్ ఒయాసిస్ లిటరరీ మెరిట్‌కు ప్రథమ బహుమతి, ఈటెక్నో విద్యార్థులు రూపొందించిన సెలెస్టియన్ బిగినింగ్స్ కాస్మిక్ ఎండింగ్ లిటరరీ మెరిట్‌కు ద్వితీయ స్థానం, సెలస్టియన్ కొరియోగ్రఫీ లిటరరీ మెరిట్‌కు తృతీయ స్థానంతో పాటు మరిన్ని విభాగాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. కార్యక్రమంలో నారాయణ పాఠశాలల డీన్లు, కో ఆర్డినేటర్లు, ఆర్ఐలు, ప్రిన్సిపాళ్లు రాజేష్, అనిత, ధనలక్ష్మి, మహేష్, కిషోర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.